క్లుప్తంగా

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన స్వయంభు శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆశ్వీయుజ మాసం రెండవ శనివారం సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు. వారికి ఆలయ పూజారి పెంచలయ్యస్వామి తీర్థప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ప్రతి శనివారం నో బ్యాగ్ డే



నో బ్యాగ్ డేలో ఉపాధ్యాయురాలు జవహర్‌మునీర్, విద్యార్థులు

ప్రొద్దుటూరు : ప్రభుత్వం రూపొందించిన క్యాలెండర్ ప్రకారం ప్రతి శనివారం ప్రభుత్వ పాఠశాలల్లో నో బ్యాగ్ డే నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఎస్.జవహర్‌మునీర్ తెలిపారు. ప్రొద్దుటూరు మండలంలోని లింగారెడ్డినగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఆమె శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శనివారం రోజున విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు లేకుండా ఆటపాటలతో పాఠాలు నేర్పించడం జరుగుతుందన్నారు. దీని ద్వారా పిల్లల్లో మానసిక ఉల్లాసం పెరిగి పాఠశాలకు రావడానికి ఆసక్తి కనబరుస్తారన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ గోవిందరెడ్డి

పోరుమామిళ్ల : మండలంలోని బొప్పాపురం గ్రామంలో శ్రీ సీతారామస్వామి ఆలయ 13 వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి దంపతులు, రాష్ట్ర విద్యార్థి విభాగ ప్రధాన కార్యదర్శి ఆదిత్యారెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఆలయంలో వారు ప్రత్యేక పూజలు నిర్వహించి, సీతారాముల కల్యాణం తిలకించారు. వేదపండితులు వారికి ఆశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ బూతు కన్వీనర్ల సమన్వయకర్త కల్లూరు రమణారెడ్డి, సర్పంచ్ రఘురామిరెడ్డి, జిల్లా విద్యార్థి విభాగం ఉపాధ్యక్షుడు సాయినారాయణరెడ్డి, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

7న క్రీడా పోటీలు



మాట్లాడుతున్న హెచ్‌ఎం వసుంధర దేవి

రాజుపాళెం : రాజుపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 7న ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 పోటీలను బాలబాలికలకు నిర్వహించనున్నట్లు హెచ్‌ఎం వసుంధర దేవి తెలిపారు. ఆ పాఠశాలలో ఆమె శనివారం మాట్లాడుతూ 7న వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, 8న అథ్లెటిక్స్, యోగా, చెస్ పోటీలు నిర్వహిస్తామని వివరించారు. ఈ పోటీలను మండల స్థాయిలో నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు 6వ తేదీ సాయంత్రం లోపు ఎంట్రీ ఫాం పీడీలకు ఇవ్వాలని సూచించారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన వారు జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పూర్తి వివరాలకు 9885303717 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ప్లాస్టిక్ నిషేధం అందరి బాధ్యత



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ ఓబుళమ్మ

ప్రొద్దుటూరు రూరల్ : ప్లాస్టిక్ నిషేధం ప్రతి ఒక్కరి బాధ్యత అని జెడ్పీ సీఈఓ, నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఓబుళమ్మ తెలిపారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆమె ప్రొద్దుటూరు నియోజకవర్గ అధికారులు, ప్లాస్టిక్ కవర్ల తయారీదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లు తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీఓ రామాంజనేయులు, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, ప్రొద్దుటూరు, రాజుపాళెం ఎంపీడీఓలు సూర్యనారాయణరెడ్డి, రామనాథరెడ్డి, ఈఓపీఆర్డీ రామాంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి సమష్టి కృషి

అట్లూరు : వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి తెలిపారు. బద్వేలు నియోజకవర్గ నాయకులకు వైఎస్సార్‌సీపీలో కీలక పదవులు వరించాయి. ఎమ్మెల్సీ గోవిందరెడ్డిని సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (సీఈసీ) మెంబర్, స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఎస్ఈసీ) మెంబర్లుగా వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి, నల్లేరు విశ్వనాథరెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా బద్వేలు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం ఎమ్మెల్సీ గోవిందరెడ్డిని కలిశారు. పోరుమామిళ్లలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కల్లూరు రమణారెడ్డి, బద్వేలు మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రామసుబ్బారెడ్డితోపాటు పలువురు నాయకులు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డిని సత్కరించి స్వీట్లు తినిపించారు. ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డితో నాయకులు మాట్లాడుతూ మీ నాయకత్వం తమకు ఆదర్శమని, మీ కింద నాయకులుగా ఎదగడం మాకు ఎంతో ఉత్సాహాన్ని నింపుతోందని తెలిపారు. దీంతో ఉత్సాహభరితుడైన ఎమ్మెల్సీ మాట్లాడుతూ పార్టీ కోసం మన సేవలను గుర్తించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మనకు అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నారని, మీ బాధ్యతలకు అనుగుణంగా మీరు కూడా పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. 2029లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత మనందరి భుజస్కందాలపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్యారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్‌బాబు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కేశవరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ శ్రీరాములు, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ సుబ్బారెడ్డి, వక్ఫ్‌బోర్డు మాజీ డైరెక్టర్ ఉమర్, మాజీ సర్పంచ్ రఘురామిరెడ్డి, ఏరియా కన్వీనర్ చెన్నకృష్ణారెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు గుబ్బా చంద్రశేఖర్, ఎంఆర్‌ఎఫ్ టైర్స్ రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తిరుపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డితో వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎమ్మెల్సీ గోవిందరెడ్డికి సత్కారం

పోరుమామిళ్ల : ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డిని ఇటీవల సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ (సీఈసీ)గా పార్టీ నియమించిన సందర్భాన్ని పురస్కరించుకొని శనివారం ఎమ్మెల్యే డాక్టర్ సుధ పోరుమామిళ్లలో గోవిందరెడ్డిని కలిసి అభినందనలు తెలిపారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గోవిందరెడ్డి పార్టీకి చేస్తున్న సేవలు ఉన్నతమైనవన్నారు. ఆయనకు మరింత ఉన్నత పదవులు రావాలన్నారు. పదవులకు ఆయన ఓ రోల్ మోడల్ అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి ఆదిత్యారెడ్డి, జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



గోవిందరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే సుధ

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం

బద్వేలు అర్బన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు కొనసాగిస్తామని సీపీఐఎంఎల్ లిబరేషన్ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్.చంద్రశేఖర్, జిల్లా కమిటీ సభ్యులు కె.జకరయ్య పేర్కొన్నారు. శనివారం స్థానిక భగత్‌సింగ్‌నగర్‌లోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా ప్రజలను నిలువునా మోసం చేసిందని అన్నారు. 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగులకు రూ.3 వేల నిరుద్యోగభృతి ఇస్తామని చెప్పి ఆ హామీలను నెరవేర్చకుండా నిరుద్యోగుల ఆశలపై నీళ్ళు చల్లిందన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 16న కడపలో జరగనున్న రాయలసీమ జిల్లాల సదస్సు, డిసెంబర్ 6, 7వ తేదీల్లో జరిగే సీపీఐఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర 9వ మహాసభల్లో చర్చించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరుకు సిద్ధమవుతామని తెలిపారు. అనంతరం ఈ నెల 16న జరగనున్న రాయలసీమ జిల్లాల సదస్సు కరపత్రాలను విడుదల చేశారు. సమావేశంలో సీపీఐఎంఎల్ లిబరేషన్ జిల్లా కమిటీ సభ్యులు అనిల్, ఏరియా కమిటీ సభ్యులు బాబు, రామరాజు, జయరామరాజు, మహబూబ్‌బాషా, నారాయణ, చంద్రపాల్, విజయరావు, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



రాయలసీమ జిల్లాల సదస్సు కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

ప్రాధాన్యత క్రమంలో ఉపాధ్యాయులను నియమించాలి

గోపవరం : ఉపాధ్యాయులు లేని పాఠశాలల్లో 2025 డీఎస్సీ ఉపాధ్యాయులను ప్రాధాన్యత క్రమంలో నియమించాలని డెమోక్రటిక్ పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మానుగుంటరవిశంకర్ శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఉపాధ్యాయులు లేని, గత బదిలీల్లో బదిలీయై రిలీవ్ కాని ఉపాధ్యాయుల స్థానాల్లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా ప్రాధాన్యత క్రమంలో నూతన ఉపాధ్యాయులను నియమించాలన్నారు. బదిలీ అయినా వారి స్థానంలో ఉపాధ్యాయులు లేకపోవడంతో ఆయా పాఠశాలల్లోనే రిలీవ్ కాకుండా కొనసాగుతున్నారన్నారు. గత బదిలీల్లో బదిలీ పొందిన వారిని వీలైనంత తొందరగా రిలీవ్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

'నా భూమిని కబ్జా చేశారు'

ప్రొద్దుటూరు రూరల్ : పిత్రార్జితంగా వచ్చిన తన భూమిని దౌర్జన్యంగా సాగు చేసుకుంటూ ఇబ్బందులు పెడుతున్నారని చాపాడు మండలం ఖాదర్‌పల్లె గ్రామానికి చెందిన తాళ్లమాపురం కమాల్ సాహెబ్ దంపతులు శనివారం ప్రొద్దుటూరు తహసీల్దార్ గంగయ్యకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కమాల్ సాహెబ్ మాట్లాడుతూ తమ భూములు తాళ్లమాపురం గ్రామ పంచాయతీ పొలంలోని సర్వే నంబర్ 739లో 1.25 ఎకరాలు, 462/ఏ1లో 0.55 ఎకరాలు ఉందన్నారు. తన భూమిని ఓ వ్యక్తి ఆక్రమించి సాగు చేసి పంటలు పండిస్తున్నాడన్నారు. అధికారులు కూడా ఇందుకు సహకరించడంతో తాను ఇబ్బందులు పడుతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. తాను భూమి వద్దకు వెళ్లిన ప్రతి మారు తనను నానా దుర్భాషలాడి కొట్టడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. గతంలో అనేక మార్లు వీఆర్‌ఓకు ఫిర్యాదు చేశానని, రెవెన్యూ సదస్సుల్లో అర్జీలు ఇచ్చినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. తనకు ఒక కన్ను మాత్రమే ఉందని, వృద్ధ దంపతులమైన తమకు మరో జీవనాధారం లేదని, ఉన్నతాధికారులు విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు. కబ్జా దారుల నుంచి తమ భూమిని విడిపించి న్యాయం చేయాలని కోరారు. ఈ విషయంపై తహసీల్దార్ వి.గంగయ్య మాట్లాడుతూ ఇది పట్టా భూమి అని, తాము ఏమి చేయలేమన్నారు. బాధితుడు పోలీస్‌స్టేషన్ లేదా కోర్టును ఆశ్రయించవచ్చన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న కమాల్ సాహెబ్

కేసు నమోదు

కాశినాయన : మండలంలోని చిన్నాయపల్లె గ్రామానికి చెందిన గుర్రాల రాజకుమార్‌రెడ్డిపై శనివారం కేసు నమోదు అయింది. ఎస్ఐ యోగేంద్ర తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అదే గ్రామానికి చెందిన గుర్రాల రమణారెడ్డి వద్ద రాజకుమార్‌రెడ్డి పలు మార్లు డబ్బు అప్పుగా తీసుకున్నాడు. ఇద్దరి మధ్య డబ్బుల విషయమై గొడవ జరిగింది. రమణారెడ్డిపై రాజకుమార్‌రెడ్డి దాడి చేసి గాయపరిచాడు. రమణారెడ్డి ఫిర్యాదు మేరకు రాజకుమార్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

కలసపాడు : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు శనివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ తిమోతి కౌన్సెలింగ్ ఇచ్చారు. భవిష్యత్తులో ఎలాంటి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడకూడదని, అలా పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

ఓటర్ల జాబితా అవకతవకలపై అవగాహన



కరపత్రాలు పంపిణీ చేస్తున్న రామసుధాకర్‌రెడ్డి

చాపాడు : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఓట్ చోరీ గద్దీ చోడ్ అనే కార్యక్రమంలో భాగంగా శనివారం చాపాడులో నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి చాపాటి రామసుధాకర్‌రెడ్డి ప్రజలకు అవగాహన కల్పిస్తూ సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఎన్నికల సంఘంలో జరుగుతున్న ఓట్ల చోరీ అంశాన్ని సాక్షాధారాలతో దేశ ప్రజల ముందు ఉంచారన్నారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

7 నుంచి అథ్లెటిక్ పోటీలు

జమ్మలమడుగు : మండల స్థాయి అథ్లెటిక్ పోటీలను ఈ నెల 7వ తేదీ నుంచి ప్రారంభిస్తామని పీఆర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శశికళ తెలిపారు. మండల పరిధిలోని పీఈటీలతో ఆమె అథ్లెటిక్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఆటో డ్రైవర్ల ఉపాధి కోసం ఆర్థిక సాయం

ప్రొద్దుటూరు : ఆటో డ్రైవర్ల ఉపాధి కోసం కూటమి ప్రభుత్వం రూ.15 వేల ఆర్థిక సాయం అందించిందని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శనివారం నిర్వహించిన ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గాంధీ విగ్రహం నుంచి మున్సిపల్ కార్యాలయానికి ఎమ్మెల్యే ఆటో డ్రైవర్లతో కలసి ర్యాలీగా వచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను వరుసగా అమలు చేస్తున్నారని తెలిపారు.

ఉపాధి కోల్పోతున్న ఆటో డ్రైవర్ల పరిస్థితిని గమనించి ప్రస్తుతం సహాయం అందించారన్నారు. అనంతరం ఆటో డ్రైవర్లకు మెగా చెక్కును అందించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ఓబుళమ్మ, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, టీడీపీ నాయకులు నంద్యాల కొండారెడ్డి, వీఎస్ ముక్తియార్, ఈవీ సుధాకర్‌రెడ్డి, బీజేపీ పట్టణాధ్యక్షుడు వంకదారి నరేంద్రరావు, జనసేన నాయకుడు జిలాని, సుంకర మురళీ, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



ఆటో డ్రైవర్లకు మెగా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం

మైదుకూరు : ప్రభుత్వం 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకం ద్వారా ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు ఆర్థిక సాయాన్ని అందిస్తోందని డ్వామా పీడీ, నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఆదిశేషారెడ్డి తెలిపారు. శనివారం మైదుకూరులో ఆటో డ్రైవర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న 1230 మంది ఆటో డ్రైవర్లకు వారి ఖాతాలో ప్రభుత్వం అందించే ఆర్థిక సాయాన్ని జమ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మైదుకూరు నియోజకవర్గంలోని ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

రాజుపాళెం : వెల్లాల పుణ్య క్షేత్రంలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమ లింగేశ్వర, నరసింహస్వామి ఆలయాల్లో శనివారం భక్తుల సందడి నెలకొంది. ఉదయం నుంచే స్వాములకు అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చన చేశారు. భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రామ్మోహన్ ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అలాగే నిర్మాణంలో ఉన్న శ్రీ చెన్నకేశవ సంజీవరాయస్వామి ఆలయానికి ప్రొద్దుటూరుకు చెందిన నూకల నాగేశ్వరరావు దంపతులు రూ.25 వేలు విరాళంగా అందించారు. వారిచే అర్చకులు ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం వారికి శాలువా కప్పి సత్కరించారు.



విరాళం అందిస్తున్న నాగేశ్వరరావు

ప్రైవేట్ ట్రావెల్స్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు : దసరా, విద్యా సంస్థల సెలవుల సందర్భంగా ప్రజల నుంచి అధిక మొత్తంలో చార్జీలు వసూలు చేస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మేరికుమార్, విశ్వనాథ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని బస్సు టికెట్ల ధరలను పెంచారని వారు పేర్కొన్నారు. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, విజయవాడ, విశాఖపట్నంకు ప్రైవేట్ బస్సు సర్వీసులు నడుపుతున్నారని తెలిపారు. ఇద్దరు డ్రైవర్లు ఉండాల్సి ఉండగా ఒకరితోనే సర్వీసులను తిప్పుతూ డ్రైవర్లపై ఒత్తిడి పెంచుతున్నారన్నారు. ఇప్పటికైనా రవాణా శాఖ అధికారులు ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమం ఆవరణలోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల ఆవరణలో ఆదివారం ఉదయం 10 గంటలకు అవార్డీ టీచర్స్ అసోసియేషన్, సంస్కృతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించనున్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన వారిని సన్మానించనున్నట్లు అవార్డీ టీచర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కేఎల్‌వీ రమణయ్య, సంస్కృతి సేవా సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

చలానా, ఇంధన ధరల పెంపుతో డ్రైవర్లకు నష్టం

ఖాజీపేట : ఒకవైపు చలానాల పేరుతో అధిక డబ్బులు వసూలు చేయడం, మరోక వైపు ఇంధన ధరలు పెంచి ఆటో డ్రైవర్లకు కూటమి ప్రభుత్వం తీవ్ర నష్టం చేకూరుస్తోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకసుబ్బారెడ్డి అన్నారు. దుంపలగట్టు గ్రామంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. డ్రైవర్ల నుంచి అదనంగా డబ్బులు వసూలు చేసి తిరిగి వారికి రూ.15 వేలు ఇచ్చి మేలు చేస్తున్నట్లు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. ఇది కొత్త పథకం అని కూటమి ప్రభుత్వం చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. గతంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వాహన మిత్ర పథకం ద్వారా ఒక్కొక్కరికి ఏటా రూ.10 వేల చొప్పున ఐదేళ్లకు రూ. 50 వేలు ఇచ్చారని అన్నారు. ఆ పథకాన్నే పేరు మార్చి కొనసాగించి కొత్త పథకంగా చెప్పడం మోసగించడం కాదా అని ప్రశ్నించారు. ఒక చేత్తో చలానాలు, ఇందన ధరలు పెంచి.. మరొక చేత్తో వారికి ఆర్థిక సాయం ఇస్తున్నట్లు నటించడం వారిని మోసగించడం కాదా అని ఆయన ప్రశ్నించారు.



రెడ్యం వెంకటసుబ్బారెడ్డి

ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

మైదుకూరు : ఎన్నికల సమయంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని ఫ్యాప్టో, ఎస్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ శనివారం మైదుకూరులో ఫ్యాప్టో, ఎస్టీయూ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక మండల విద్యాశాఖాధికారి కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ఈ ర్యాలీ జరిగింది. అనంతరం నియోజకవర్గ ఫ్యాప్టో నాయకులు, ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ కూశెట్టి పాలకొండయ్య, జిల్లా ఆర్థిక కార్యదర్శి గోశెట్టి రామమోహన్ మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాల నుంచి తప్పించడం, అధికారంలోకి వచ్చిన వెంటనే మెరుగైన పీఆర్సీ, మధ్యంతర భృతి మంజూరు, సీపీఎస్ స్థానంలో మెరుగైన పెన్షన్ విధానం, ఆర్థిక బకాయిల చెల్లింపు, పెన్షనర్లకు కార్పొరేషన్ ఏర్పాటు వంటి హామీలను ఇచ్చి కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చాయన్నారు. 16 నెలలు గడిచినా ఏ ఒక్క హామీ పూర్తి స్థాయిలో అమలు కాలేదని విమర్శించారు. అనంతరం తహసీల్దార్ నరేంద్రకు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.వెంకటసుబ్బయ్య, జి.చంద్రశేఖర్, కిరణ్‌కుమార్, రమణయ్య, నారాయణ ప్రసాద్, మనోహర్, నాయక్, రమేష్, రవికుమార్, నాగరాజు, విజయుడు, నరసింహరాజు, విజయ్, మధు, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.



మైదుకూరులో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

సమస్యలు పరిష్కరించాలి

పోరుమామిళ్ల : ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ మొండి వైఖరి నిరసిస్తూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో పట్టణంలో అంబేడ్కర్ సర్కిల్ నుంచి ఉపాధ్యాయులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో రాష్ట్ర నాయకులు రమణారెడ్డి, సుబ్రమణ్యం, చెన్నయ్య, సురేంద్రనాథరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులకు ఫ్రెండ్లీ ప్రభుత్వం అని చెబుతూనే రాష్ట్రంలో 12 లక్షల ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు సంబంధించిన ఏ ఒక్క సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించలేదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు చెల్లించాల్సిన దాదాపు రూ.30 వేల కోట్ల ఆర్థిక బకాయిల చెల్లింపుపై ప్రభుత్వం రోడ్‌మ్యాప్ ప్రకటించాలని కోరినప్పటికీ ఇంత వరకు స్పందన లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు చంద్రహాసరెడ్డి, కృష్ణారెడ్డి, ప్రసాద్, రాంభూపాల్‌రెడ్డి, బాలజోజి, వెంకట్రామిరెడ్డి, శేఖర్‌బాబు, పుల్లారెడ్డి, బాలరాజు, చంద్రశేఖర్, పుల్లయ్య, రవీంద్రబాబు, జయరామిరెడ్డి, సిద్దారెడ్డి, నారాయణ, ఈశ్వరరావు, చెన్నక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

7న ధర్నా జయప్రదం చేయాలి



పోరుమామిళ్లలో ఫ్యాప్టో ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

బద్వేలు అర్బన్ : విజయవాడలో ఈ నెల 7న ఫ్యాప్టో ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) నేతలు మాదన విజయకుమార్, జి.వి.సుబ్బారెడ్డి, సి.రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. సీపీఎస్ ఉద్యోగులకు మెరుగైన పెన్షన్ విధానం అమలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఇంత వరకు చర్చించలేదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు ప్రతి సంవత్సరం రూ.180 కోట్లు హెల్త్ కార్డుల అమలు కోసం రుసుం చెల్లిస్తున్నప్పటికీ హెల్త్ కార్డుపై వైద్యానికి ఏ హాస్పిటల్‌లో అంగీకరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ఆయా ఉపాధ్యాయ సంఘాల నాయకులు సుధాకర్, శ్రీకాంత్, సుబ్బరాయుడు, దేవానందం, రమేష్‌రాజా, శ్రీనివాసులు, పెంచలయ్య, మస్తాన్‌వలి, జకరయ్య, చక్రపాణి, వెంకటసుబ్బయ్య, మునెయ్య, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.